# ప్రశాంత నగరంగా ఖమ్మం



2 లో

-రోడ్ల విస్తరణతోనే అభివృద్ధి
-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
-రజక భవనానికి, యుపిహెచ్‌సికి శంకుస్థాపన, ప్రారంభోత్సవం

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 28 | జనవరి | 2026
పేజీలు : 8

# నేటి నుంచి మున్సిపల్ నామినేషన్స్




-ఫిబ్రవరి 11న పోలింగ్
- 13న ఓట్ల లెక్కింపు
-16న మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్ల ఎన్నిక

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు అశ్వారావుపేట, ఇల్లందు, ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 28 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. మున్సిపాలిటీలలోనూ, కార్పోరేషన్లలోనూ రెండు మూడు డివిజన్లను కలిపి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 28న ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియ 30 వరకు కొనసాగుతుంది. 30న సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల స్వీకరణకు ఆఖరు గడువుగా నిర్ణయించారు. 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి రెండున సాయంత్రం ఐదు గంటల లోపు పరిశీలనలో అర్హత కోల్పోయిన అభ్యర్థులను తొలగించడం ఫిబ్రవరి 3న మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా మధ్యాహ్నం మూడు గంటల తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థులు తుది జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 11న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుంది. ఓట్ల లెక్కింపు అనంతరం విజేతలను

మిగతా 2లో..

# అంత తేలిక కాదు..

-మున్సిపల్ ఎన్నికల గెలుపు కోసం మల్లగుల్లాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలో బరిలో దింపే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు కానీ విపక్షాలకు కానీ గెలుపు అంత తేలికగా లేదు. విపక్షం, అధికార పక్షం అనే తేడా లేకుండా అన్ని పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. కాంగ్రెస్‌కు అధికారం కలిసి వచ్చే అవకాశమే అయినా స్థానిక నాయకుల వ్యవహారం ఆ పార్టీకి కొంత ఇబ్బందికరమే. కాంగ్రెస్ నాయకులలో కొంత మంది మంత్రుల స్థాయిని మించి ఊహించుకుంటూ సామాన్య ప్రజలను పట్టించుకునే స్థితిలో లేరు. అంతే కాదు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను

మిగతా 2లో..

# ఎక్సైజ్ కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు..!



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బెల్ట్ షాపులు ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. బెల్ట్‌షాపుల నిర్వహణ ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరికి తెలుసు. ఏ బెల్ట్ షాపుకు ఏ మద్యం దుకాణం నుండి మద్యం సరఫరా అవుతుందనే విషయం మొదలు ఎంఆ

-ఎంఆర్‌పిపై అదనపు బాదుడు
-మద్యం వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు

ర్‌పి కంటే ఎంత అదనంగా విక్రయిస్తున్నారనే విషయం తెలుసు. మద్యం వ్యాపారులు, బెల్ట్ షాపు యజమానులు కుమ్మక్కై మద్యం

మిగతా 2లో..

# దివ్యాంగులకు అండగా ప్రభుత్వం




- దివ్యాంగుల కోసం రూ.100 కోట్లు ఖర్చు చేశాం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/ మధిర :** గత ప్రభుత్వం పదేళ్లలో దివ్యాంగులకు చేయలేనటువంటి పనులని ఈ ప్రభుత్వం రెండేళ్లలోనే చేస్తుందని, అందులో భాగంగానే ఈ రెండేళ్లలో దివ్యాంగుల కోసం రూ.100 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో ఆయన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన అనంతరం ప్రసంగించారు. చదువుకుంటున్న దివ్యాంగులకు ఐపాడ్లు, కంప్యూటర్లు ట్యాబ్స్ ప్రజా ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. మాది ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యలపై ఆలోచన చేసేటువంటి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఈ ప్రభుత్వంలో దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూస్తామని, వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుం దని అన్నారు. సమాజంలో ఇతరులు

మిగతా 2లో..

# అంత తేలిక కాదు..

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ పెద్దలను సైతం తప్పుదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. జనం మధ్య ఉండే వారి కంటే పైరవీకారులకు ప్రాధాన్యతనిస్తున్నారు. మరి కొంత మంది మిగిలిన రాజకీయ పార్టీలను లెక్కచేసే పరిస్థితి లేకపోవడంతో అధికార పార్టీకి ఎదురు గాలి తగిలే అవకాశం ఉంది. అధికారం ఉన్నా లేకున్నా ఓటర్లలో మెజార్టీ ఒకే అభిప్రాయంతో ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ కూడా మున్సిపల్ ఎన్నికలపై కసరత్తు చేస్తుంది. మున్సిపాలిటీలకు ఇంచార్జిలను నియమించడంతో ఇప్పటికే ఒక దఫా ఎన్నికల సమావేశాలను నిర్వహించారు. విపక్షంలో ఉన్న బిఆర్ఎస్ తరుపున పోటీ చేసేందుకు పలువురు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కొత్తగా ఏర్పడిన కల్లూరు, అశ్వారావుపేట, ఏదులాపురం మినహాయిస్తే పాత మున్సిపాలిటీలలో పార్టీ ఫిరాయించిన వారు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. గతంలో ఆయా వార్డులు లేక డివిజన్లలో పోటీ చేసిన కాంగ్రెస్ నాయకులను కాదని ఇటీవల పార్టీలో చేరిన వారికి టికెట్ కేటాయించడం ఇబ్బందికరంగా మారనుంది. సత్తుపల్లి, వైరా, ఇల్లందు, మధిర మున్సిపాలిటీలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. స్థానిక పరిస్థితులు నాయకత్వ వ్యవహార శైలి ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఖర్చు చేయగలిగితేనే గెలుపు :**

గత కొంత కాలంగా గెలుపును డబ్బు ప్రభావితం చేస్తుంది. ఖర్చు చేసే అభ్యర్థులకు గెలుపు అవకాశాలు దక్కుతున్నాయి. సాధారణ ఎన్నికల మొదలు స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఓట్ల కొనుగోలు ఓ సాధారణ ప్రక్రియగా మారిపోయింది. గడిచిన పంచాయతీ ఎన్నికల్లో ఆయా పరిస్థితులను బట్టి ఓటు ధర రెండు వేల నుంచి పదివేల రూపాయల వరకు పలికింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండకపోవచ్చు. అందుకే రాజకీయ పార్టీలు పేరు, పలుకుబడితో పాటు గెలుపు గుర్రాల పేరిట ఆర్థికంగా బలంగా ఉండి ఖర్చు చేయగలిగిన వారిని రంగంలోకి దింపేందుకు ప్రయత్నిస్తున్నాయి. రిజర్వేషన్, జనరల్ స్థానాలు అనే బేధం లేకుండా ఖర్చు పెడితేనే గెలుపు దక్కుతుండడంతో రాజకీయ పార్టీలు ఆర్థికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించుతున్నాయి.

**జిల్లాలో వామపక్షాలు కీలకం :**

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఎన్నికలు జరుగుతున్న కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు అన్ని మున్సిపాలిటీలలోనూ వామపక్షాలు కీలకం కానున్నాయి. కొత్తగూడెంలో సిపిఐ కలిసి వచ్చే పార్టీలను కలుపుకుని మేయర్ స్థానం కోసం పోటీ పడుతుంది. మిగిలిన అన్ని మున్సిపాలిటీలలోనూ వామపక్షాలకు గణనీయమైన సంఖ్యతో ఓట్లు ఉండి ఎన్నికల్లో గెలుపును ప్రభావితం చేయగలిగిన స్థాయిలో ఉన్నాయి. ఏదులాపురం, ఇల్లందు, వైరా, అశ్వారావుపేట, మధిరలో సిపిఐ తన అభ్యర్థులను బరిలోకి దించనుంది. సిపిఎం బిఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయనుంది. ఏదులాపురంలో ఒంటరిగా బరిలోకి దిగనున్నట్లు సిపిఐ ప్రకటించింది.

# నేటి నుంచి మున్సిపల్ నామినేషన్స్

(మొదటిపేజీ తరువాయి)



ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక కొనసాగుతుంది. జనవరి 28న ప్రారంభమైన మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 16తో ముగియనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఐదు మున్సిపాలిటీలకు గాను 117 వార్డుల్లోనూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందులో 24, అశ్వారావుపేటలో 22 మున్సిపల్ వార్డులకు , కొత్తగూడెం కార్పోరేషన్‌లోని 60 డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. బరిలో నిలిచే అభ్యర్థులకు సంబంధించి ఇప్పటికే ఒక దఫా పార్టీలు పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేశాయి. ఖమ్మం జిల్లాలో సిపిఎం, బిఆర్ఎస్ పార్టీలు ఎన్నికల పొత్తుతో బరిలో దిగనుండగా ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ ఒంటరిగా బరిలోకి దిగనుంది. మిగిలిన మున్సిపాలిటీల్లో వివిధ పార్టీల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. కొత్తగూడెం కార్పోరేషన్‌లో కలిసి వచ్చే పార్టీలతో సిపిఐ బరిలోకి దిగేందుకు నిర్ణయించుకుంది. ఇక్కడ మేయర్ స్థానాన్ని సిపిఐ ఆశిస్తుంది. మున్సిపాలిటీలు, కార్పోరేషన్ల పరిధిలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

# దివ్యాంగులకు అండగా ప్రభుత్వం



(మొదటిపేజీ తరువాయి)

కన్నా ఎక్కువ అవకాశాలను ఆసరాను దివ్యాంగులకు మనం అందించాలని అన్నారు. అంగ వైకల్యంతో ఉన్నామన్న బాధ వారికి రాకుండా వారిని ప్రోత్సహించి ముందుకు తీసుకువెళ్లాలని, ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఈ ఆలోచన దిశగానే ముందుకు సాగుతోందని అన్నారు.

**రూ.140కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన...**

మధిర పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. పట్టణంలోని వైరా నదికి రూ.70కోట్లతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.75కోట్లతో నిర్మించనున్న వరదకాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధిర పట్టణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మధిర మున్సిపాల్టీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ ప్రాంత ఎమ్మెల్యేగా అభివృద్ధి నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీజ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కనుసన్నల్లోనే 'బెల్ట్ షాపులు'..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రియులను దోపిడీ చేస్తుంటే ఎక్సైజ్ శాఖ శక్తి కి మించి సహకరిస్తుంది. మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన ఖరీదైన మద్యం కూడా బెల్ట్‌షాపుల్లో విక్రయించడంతో పాటు కొందరు మద్యం వ్యాపారులే మద్యం దుకాణాలకు అత్యంత సమీపంలో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేయించి మద్యం విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ వ్యాపారులకు దన్నుగా నిలవడంతో తాము ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందిలే అన్న వ్యాపారుల్లో నెలకొంది.

**నాలుగు రోజులు ఆపండి :**

మద్యం విక్రయాలకు సంబంధించి నాలుగు రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోండి అంటూ ఓ ఎక్సైజ్ అధికారి మద్యం వ్యాపారులకు ఫోన్ చేసి చెబుతున్నారు. మీడియాలో బెల్ట్‌షాపుల నిర్వహణ మద్యం అధిక ధరకు విక్రయించటం తదితర విషయాలపై వార్తలు వస్తున్నందున మేము చెప్పే వరకు నిబంధనలు పాటించండి అంటూ సూచనలు చేస్తున్నారు. మద్యం వ్యాపారులు బెల్ట్‌షాపులకు సరఫరా చేసే మద్యానికి సంబంధించి ఎంఆర్‌పిపై ఐదు నుంచి పది రూపాయల వరకు వసూలు చేస్తున్నందున లాభాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అధికారి చెప్పినా సూచనలను పాటించడం లేదు. ఆదేశించే స్థాయి నుంచి బతిమిలాడుకునే స్థాయికి ఎక్సైజ్ అధికారులు దిగజారారు. మామూళ్ల మత్తు ఎక్సైజ్ అధికారులకు ఈ దుస్థితిని తెచ్చిపెట్టిందన్న ప్రచారం జరుగుతుంది.

**బెల్ట్‌షాపులు లేనిదెక్కడ...?**

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో బెల్ట్ షాపులేనిదెక్కడ. పల్లె, పట్టణం అనే తేడా లేకండా ఎక్కడపడితే అక్కడ మద్యాన్ని విక్రయిస్తున్నారు. కొన్ని బెల్ట్‌షాపుల ద్వారా బార్లను తలదన్నే రీతిలో సిట్టింగ్‌లను ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారుల వెంట మద్యాన్ని విక్రయించకూడదన్న నిబంధన బెల్ట్‌షాపులకు వర్తించడం లేదు. బెల్ట్‌షాపుల ద్వారా మద్యం ప్రియులను దోచుకోవడమే గాక బెల్ట్‌షాపులు ఘర్షణలకు కేంద్రాలుగా మారుతున్నాయి. పోలీస్ అధికారులు కూడా ప్రత్యక్షంగానో పరోక్షంగానో బెల్ట్‌షాపుల నిర్వహణకు సహకరిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖకు లేని పట్టింపు మనకు ఎందుకు అనుకున్నారో ఏమో కానీ ఆ వైపు దృష్టి సారించడం లేదు.

**దోపిడికే మద్యం సిండికేట్స్ :**

మద్యం ప్రియులను దోచుకునేందుకే మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. అంత కుమ్మకై తాము అనుకున్న రీతిలో మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ సిండికేట్స్ ఎక్సైజ్ శాఖను నియంత్రిస్తున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ ఇప్పటికైనా మామూళ్ల మత్తు వీడి మద్యం వ్యాపారుల దోపిడిని అరికట్టాలి. బెల్ట్‌షాపుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ప్రజలు బెల్ట్‌షాపుల నిర్వహణపై ఎక్సైజ్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇది ఆందోళనకు దారి తీయక ముందే ఎక్సైజ్ అధికారులు మేల్కొంటే మంచిది.

# కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ



**ప్రజాపక్షం/కల్లూరుః** మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో ఫిబ్రవరి 11వ తేదీన జరగబోయే ఎన్నికలకు గాను ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ డి హరిత తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు ఓటర్లు సహకరించాలని ఓటర్లను కోరారు. ఉల్లంఘిస్తే ఎవరినైనా ఎలాంటి వారినైనా వదిలేది లేదని అన్నారు. కల్లూరు పట్టణంలోని మూడు నామినేషన్ కేంద్రాలలో నామినేషన్ ప్రక్రియ జరుగుతుందని ఎంపీడీవో కార్యాలయం, రైతు వేదిక, స్త్రీ శక్తి భవనం, లలో నామినేషన్ ప్రక్రియ మూడు రోజులపాటు జరుగుతాయని మూడో తేదీ తిరస్కరణ అదే రోజు నుంచి ప్రచారం మొదలవుతుందని 11 పోలింగ్ అవుతుందని పేర్కొన్నారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. ప్రతిష్ఠాత్మక వార్డులలో బందోబస్తు అధికంగా ఉంటుందని, అదే విధంగా సిసి నిఘా లో నామినేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అనుక్షణం ప్రతిక్షణం నిఘా ఉంటుందని ఎస్ఐ వివరించారు.

# ప్రశాంత నగరంగా ఖమ్మం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రశాంత, పచ్చని ప్రగతిశీల నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 36వ డివిజన్‌లో రూ. 63 లక్షలతో నిర్మించనున్న రజక భవన నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. రూ. 2.43 కోట్ల వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్స్, సిబ్బందిని పెంచి 12 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం పట్టణ పిహెచ్‌సిలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రికి భారం తగ్గుతుందన్నారు. ఆరోగ్య కేంద్ర సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కోట్ల రూపాయలు ఉన్నా రహదారులు ఇరుకుగా ఉంటే ఏమి ఉపయోగం ఉండదని రహదారులను విస్తరిస్తే వ్యాపారం బాగా ఉంటుందని ఆస్తుల విలువ కూడా పెరుగుతుందని, ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవన్నారు. జనాభాకు తగినట్లు రహదారులను విస్తరించాలన్నారు. కస్బాబజార్ విస్తరణతో బ్రాండెడ్ షోరూంలు వచ్చాయన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల వారు ఖమ్మంలో నివసించేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించాలని, ప్రజలు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, స్థానిక కార్పొరేటర్ పసుమర్తి రాంమోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమైక్యలకు హక్కులు బాధ్యతలపై శిక్షణ



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని స్త్రీ శక్తి భవనంలో 26, 27 తేదీలలో గ్రామ సమాఖ్య ఓబీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం సోమవారం, మంగళవారం రెండు రోజులపాటు ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో సిఆర్పిలు షేక్ నజీమా, సిహెచ్ లక్ష్మి అవగాహన కల్పించారు. సంఘాలలో అప్పులు పొదుపులు సభ్యత్వాలు క్రమ పద్ధతిలో నిర్వహించాలని ఆదాయాలను అభివృద్ధి కార్యక్రమాలకు సభ్యుల ఆర్థిక అభివృద్ధికి ఉపయోగించాలని పాలకవర్గ సభ్యులు, బ్యాంకి లింకేజీ రుణాలు, శ్రీనిధి రుణాలు, సిఐఎఫ్ రుణాలు, తీసుకొని ఆదాయ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం అశోక రాణి, మండల సమైక్య అధ్యక్షులు సావిత్రి, సీసీలు అకౌంటెంట్, గ్రామ సమాఖ్యలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**



**ప్రజాపక్షం/మధిర :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను దీవించి పెద్ద ఎత్తున గెలిపించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కోరారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అంతా ఉమ్మడి కుటుంబంగా భావించి ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో పట్టణ ప్రాంతాల్లో రకరకాల ప్రణాళికలతో పేద, మధ్య తరగతి వర్గాల అభివృద్ధికి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మెప్మా ద్వారా మున్సిపాల్టీల్లో మహిళలకు రూ.6వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలో అనేక క్లస్టర్లుగా విభజన చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పి మున్సిపాల్టీ సమీపంలోని గ్రామాల్లో ఉపాధి, ఆదాయం పొందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో రేషన్ కార్డుల కోసం చూసి చూసి అలసిపోయిన వారందరికీ కొత్తగా రేషన్‌కార్డులు పంపిణీ చేశామని, రాష్ట్రంలో 1.15కోట్ల కుటుంబాలు ఉండగా 1.03కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఐదుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకుని అల్పాదాయ వర్గాలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, వినియోగదాల తరుపున విద్యుత్ శాఖకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తున్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. హైదరాబాద్ పట్టణంలోనే కాకుండా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ డెవలప్మెంట్ కోసం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశామని, ప్రపంచ స్థాయి విద్యను పేద బడుగు బలహీన వర్గాలకు అందించేందుకు యంగ్ఇండియా రెడిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు.

# ఎస్‌బిఐటి విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ డిజిటల్ విద్యను అందించే కార్యక్రమంలో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 34 మంది విద్యార్థులు పాల్గొనడం పట్ల జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రశంసించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పైలెట్ ప్రాజెక్టుకు తమ కళాశాల విద్యార్థులు భాగస్వామ్యమయ్యారని ఆయన తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంస పత్రాలు అందుకున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంతో పాటు కళాశాల విద్యార్థులకు స్కిల్ ఆఫ్ ఇంటర్న్‌షిప్‌గా ఇది ఇరువురికి ఉపయోగపడేలా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ జెఎన్‌టియు హైదరాబాద్ రిజిస్ట్రర్ సూచన మేరకు తమ కళాశాలకు ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ కెజిబివి, జెడ్పిహెచ్ఎస్ సింగరాయపాలెం, టిఎస్ఆర్ఈఐఎస్ ఏన్కూరు, టిజిఎంఎస్, కారేపల్లి నాలుగు పాఠశాలలను అప్పగించినట్లు ఆమె తెలిపారు. ప్రతి పాఠశాలకు ఎనిమిది మంది విద్యార్థుల చొప్పున కేటాయించామని మరో ఇద్దరిని అదనంగా కలిపి 34 మంది విద్యార్థులను ఈ ప్రాజెక్టుకు పంపించినట్లు ఆమె తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఏఐ, డిజిటల్ లెర్నింగ్ విధానాలపై విద్యార్థులకు నెల రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు కళాశాల వైస్ ఛైర్మన్ శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు మెంటర్స్‌గా వ్యవహరిస్తూ విద్యార్థులకు ఏఐ టూల్స్, ఈ లెర్నింగ్, డిజిటల్ విద్యపై శిక్షణ అందించనున్నట్లు ఆయన తెలిపారు. వారానికి నాలుగు సెషన్స్ చొప్పున నాలుగు వారాలకు 16 గంటల కోర్సును అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంచార్జిలు నూనె సరిత, ఎస్‌డి పాషా, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్ పాల్గొన్నారు.

# అరణ్య సంరక్షణతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి

**- ఖమ్మం ఎంపి రామసహాయం**
**-తెలంగాణ వన్ జీవన్ ధార**
**ఖమ్మం పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అరణ్య సంరక్షణతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మంజిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన తెలంగాణ వన్ జీవన్ ధార ఖమ్మం పైలెట్ ప్రాజెక్టును ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ విజన్ 2047కు అనుగుణంగా అరణ్యాలపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడం, ఆక్రమణలను నియంత్రించడం, మానవ వన్యప్రాణి సంఘర్షణలను నివారించడమే ప్రధాన లక్ష్యంగా ఖమ్మం జిల్లా అటవీశాఖ ముందడుగు వేసిందని ఎంపి తెలిపారు. అడవులను రక్షించుకుంటూనే సముదాయ ఆదాయ గ్రీన్ జీవనోపాదులను అభివృద్ధి చేయడం పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలకు స్థిరమైన ఉపాధి లభిస్తుందన్నారు. వన సంరక్షణ సమితులను, స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్‌లుగా తీర్చిదిద్దే ఈ ప్రయత్నాన్ని ఎంపి ప్రశంసించారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అరణ్య సంరక్షణ ఫలితాలు, సముదాయ ఆదాయం రెండింటిని ఒకే పాలన వ్యవస్థలో అనుసంధానిస్తూ స్థిరమైన జీవనోపాదులను అమలు చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. అరణ్యాలను నాశనం చేయకుండా వాటి నుంచే ఆదాయం అనే సిద్ధాంతమే ఈ కార్యక్రమానికి పునాది అన్నారు. వన సంరక్షణ సమితులను స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్ ప్రైజెస్‌లుగా తీర్చిదిద్ది పర్యావరణ భద్రతతో పాటు గ్రామీణాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నైపుణ్యాభివృద్ధి, యూనిట్ల స్థాపన, మార్కెట్ అనుసంధానం, ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యాల ద్వారా విఎస్ఎస్ లను అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎఫ్‌డివో మంజుల, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలకు అరుదైన గౌరవం

**-గవర్నర్ ఎట్ హోమ్‌లో పాల్గొన్న డైరెక్టర్ వీరేంద్ర చౌదరి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న త్రివేణి విద్యా సంస్థలకు మరో అరుదైన గౌరవం దక్కింది. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లోక్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమానికి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డా॥ గొల్లపూడి వీరేంద్రచౌదరికి ప్రత్యేక ఆహ్వానంతో పాల్గొని గవర్నర్ ఆత్మీయ విందులో భాగమయ్యారు. త్రివేణి విద్యా సంస్థల నిరంతర కృషి , విద్యా ప్రస్థానానికి దక్కిన గొప్ప గుర్తింపుగా భావిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ గవర్నర్ నుండి ఈ ఆహ్వానం అందుకోవడం అరుదైన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఇది త్రివేణి కుటుంబ సభ్యుల అందరి సమిష్టి కృషికి దక్కిన ఫలితమన్నారు. విద్యార్థులను భారత పౌరులుగా తీర్చిదిద్దే మా ప్రయత్నానికి ఇటువంటి అపురూపమైన ఘట్టాలు ఎంతో స్ఫూర్తిని ఇస్తాయని ఆయన తెలిపారు. ఎట్ హోమ్‌లో పాల్గొనడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# దివ్యాంగ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బానోత్ నాగులు, సంఘం కోశాధికారి నంచర్ల పృథ్వీ, అసోసియేట్ ప్రెసిడెంట్ గోవింద్ కృష్ణయ్య, కేతినేని శ్రీను, సిహెచ్ వేణు, మోహన్, వెంకటేష్, సాంబశివరావు, వీర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.2.20లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని రాజీవ్‌గృహకల్పలోని 2వ వార్డుకు చెందిన అన్వర్‌పాషాకు రూ. 2.20 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కును మంత్రి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగు మహేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా లభించింది. ఈ సందర్భంగా చెక్కును అందుకున్న అన్వర్‌పాషా మంత్రి, తనకు సహకరించిన ఏనుగు మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మైనార్టీ కళాశాలలో జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థుల దాడి

**-ఆందోళన చేపట్టిన తల్లితండ్రులు, విద్యార్థులు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలోగల ముస్లిం మైనార్టీ కళాశాలలో జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు సోమవారం రాత్రి దాడిచేశారంటు మంగళవారం ఉదయం కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థుల తల్లితండ్రులు కళాశాలవద్దకు చేరుకొని కళాశాల సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. గతంలో కూడా ఇలాగే సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులైన తమ పిల్లలను రెండుసార్లు దాడిచేశారని ఈవిషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా ఇలాంటివి ఇంకోసారి జరగకుండా చూస్తానని హామినిచ్చారని కాని వారి పద్ధతి మారలేదని అన్నారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జూనియర్ విద్యార్థులు గదిలోకి వెళ్లి నిద్రపోతున్న వారిని లేపి బూతులు తిట్టుకుంటు కొట్టారని ఆరోపించారు. సుమారు 12 మంది విద్యార్థులను కొట్టారని విద్యార్థులు, తల్లితండ్రులు అన్నారు. ఇరువర్గాల తల్లితండ్రులు కళాశాలకు చేరుకోవడంతో ప్రిన్సిపాల్ జితేష్ వారితో చర్చలు జరిపారు. ఏదైనా కళాశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది సరైన పర్యవేక్షణలేదని ఈవిషయంతో తేటతెల్లమయింది. పదోతరగతి విద్యార్థులకు ఫిజిక్స్ చెప్పే ఉపాధ్యాయుడు లేక సుమారు 6 నెలలు గడుస్తున్నదని పరీక్షల సమయం దగ్గరకు వచ్చిందని ఇంతవరకు ఇంచార్జ్ ఉపాధ్యాయుడుతోనే పాఠాలు బోధిస్తున్నారని విద్యార్థులు అంటున్నారు. కళాశాలను ఉన్నతాధికారులు పర్యవేక్షణచేస్తే మరిన్ని నిజాలు బయటకొచ్చే అవకాశం ఉంది. కళాశాలలో విద్యార్థుల మధ్య మూడు సార్లు ఘర్షణలు జరిగాయంటే అధికారులు పర్యవేక్షణ కొరవడిందని తెలుస్తుంది. ఇప్పటికైనా ఈ ఘర్షణలు ఆగుతాయా తిరిగి యధాతదంగా కొనసాగుతాయా అధికారులు ముందున్న ప్రశ్న. ఉన్నతాధికారులు ఈవిషయంపై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణకోరగా 5 గురు సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను కొట్టినట్లుగా ఒప్పుకుంటున్నారని ఇరువర్గాల తల్లితండ్రులతో మాట్లాడుతున్నానని మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నాని తెలిపారు.

# ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

**-డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ డి రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం నగరంలోని చిన్న వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న శ్రీతిరుమల నర్సింగ్ హోమ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని రికార్డులను సవివరంగా పరిశీలించారు. పరిశీలనలో భాగంగా ఆసుపత్రి నమోదు పత్రాలు, రోగులు నమోదు పట్టికలు, చికిత్స వివరాల ఫైళ్లు, అనుమతి పత్రాలు, మందుల నిల్వ, గడువు వివరాలు, ప్రయోగ శాల రికార్డులు, జీవవైద్య వ్యర్థాల నిర్వహణ పత్రాలు, సిబ్బంది వివరాలు, అగ్ని భద్రత, సంక్రమణ నివారణ చర్యలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి యాజమాన్యానికి చట్టాలు, నిబంధనలను పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడూ సరిగ్గా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన వైద్యసేవలు అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఆదేశించారు.

# పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గాజుల శశికిరణ్ ఎన్నిక




**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలు ఖమ్మం జిల్లా కేంద్రంలోని జార్జిరెడ్డి నగర్ భక్త రామదాసు కళాక్షేత్రంలో అత్యంత ఉత్సాహభరితంగా విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభల్లో తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన గాజుల శశికిరణ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని రాష్ట్ర కమిటీ తీర్మానించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థులందరికీ ఉచిత బస్ సౌకర్యం వర్తింపచేయాలని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని వారన్నారు.

# పది విద్యార్థులకు అల్పాహారం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని రేమిడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ సర్పంచ్ కాపు వరప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఎస్కే హుస్సేన్ సహకారంతో ప్రత్యేక తరగతులు అయిపోయేంత వరకు స్నాక్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యం, ఏకాగ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతుల వలన అలసిపోకుండా ఉండేందుకు వారికి ఉడకబెట్టిన శనగలు, వేరు శనగ చికుళ్లు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగిరెడ్డి సాంబశివరావు, హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, కుక్కల కోటేశ్వరరావు, చింతనిప్పుల శ్రీనివాసరావు, సామినేని సుమంత్, సామినేని రవితేజ, జిల్లెల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇక ఇసుక ఆన్లైన్‌లోనే..




**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఇసుక సరఫరా పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరగాలని, నిబంధనలకు విరుద్ధంగా గోదావరి నుండి నేరుగా ఇసుకను తోలితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మణిధర్ హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ లబ్దిదారులు, గృహ నిర్మాణ అవసరాలు, వ్యాపార అవసరాలు ఏమైనా సరే తప్పని సరిగా ప్రభుత్వ ఆన్లైన్ ఇసుక పోర్టల్ మన ఇసుక మన వాహనం ద్వారానే బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. తాము దగ్గరలో ఉన్న గోదావరిలో నుండి ఇసుకను తోలుకుంటామని, అక్రమంగా రవాణా చేస్తామని భావిస్తే అది సహించేది లేదని స్పష్టమైన హెచ్చరిక ఇచ్చారు. నిబంధనలను అతిక్రమించి ఇసుకను తోలిన ట్రాక్టర్లు, లారీలు, వాహన యజమానులు, డ్రైవర్లపైనా కేసులు నమోదు చేస్తామని అన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా నిఘా పెంచినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకుని, కేటాయించిన పరిధిలోని ఇసుక రీచ్‌ల నుంచే ఇసుకను తీసుకువెళ్లాలని సూచించారు. అక్రమదారులు అనుసరించే ఇసుక తోలకాలపై ఎలాంటి ఉపశమనం ఉండదని, చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు.

# పాల్వంచ నుండి మేడారం బస్సులను ప్రారంభించిన డిఎస్‌పి

**- ఆర్‌టిసి బస్సులో ప్రయాణం సురక్షితం**



**ప్రజాపక్షం/పాల్వంచ :** మేడారం జాతర ప్రయాణీకులకు సుఖవంతమైన ప్రయాణంకోసం ఆర్‌టిసి బస్సులు సురక్షితమని డిఎస్‌పి సతీష్ కుమార్ అన్నారు. పాల్వంచ నుండి మేడారం వెళ్ళే ప్రత్యేక బస్సులను మంగళవారం ఆయన ప్రారంభించారు. పాల్వంచ నుండి 150 కిలో మీటర్ల దూరానికి గాను పెద్దలకు 310 రూపాయలు,పిల్లలకు 170 రూపాయల చార్జీలుగా నిర్ణయించారని తెలిపారు. మహిళలకు ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉందని చెప్పారు.మేడారం వెళ్ళే సమ్మక్క, సారక్కల భక్తులు ఆర్‌టిసి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర, కొత్తగూడెం డిపో మేనేజర్లు రామయ్య, రాజ్యలక్ష్మి, చీఫ్ ఇన్స్‌పెక్టర్ విజయశ్రీ, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాంకుమార్, సామాజిక సేవా కార్యకర్త యడ్లపల్లి శ్రీనివాసరావు, ఆర్‌టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ర్యాబిస్ ప్రమాదం..!

-వణుకుతున్న కూసుమంచి మండల ప్రజలు
-పట్టించుకోరు పంచాయితీ పాలకవర్గాలు
-ఒక్క నెలలో వందల సంఖ్యలో కుక్క, కోతి కాట్లు
-బాధితుల్లో పసిపిల్లలే అధికం
-వన్ హెల్త్ ప్రోగ్రాం పరిష్కారం



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలానికి రేబిస్ వ్యాధి ప్రమాదం ప్రజలకు పొంచి ఉందని చెప్పటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇప్పటి వరకు జరిగిన కూసుమంచి మండలంలో కుక్కకాట్లు, కోతికాట్లతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కూసుమంచి మండలంలో మొత్తం 41 గ్రామ పంచాయితీలలో 60 వేల మంది ప్రజలు ఉన్నారు. వీరందరికీ ప్రధానమైన కేసుల కోసం ఒకే ఒక ప్రాథమిక వైద్యశాలతో ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ క్రమంలో మండలంలో ఇప్పటి వరకు అనేక మంది కుక్కకాటులకు కోతికాట్లకు గురై భయాందోళనతో జీవిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ కుక్క కోతి కాట్లు గడిచిన సంవత్సరం 2025 అక్టోబర్ నెలలో కుక్కకాటులు 102 కోతికాట్లు 21, పిల్లి కాట్లు 8, ఎలుక కాట్లు 3 మొత్తంగా 134 కాట్లు కాగా నవంబర్‌లో కుక్క కాట్లు 93, కోతి కాట్లు 9, పిల్లి కాట్లు 6, ఎలుక కాట్లు 3 మొత్తంగా 111, డిసెంబర్‌లో కుక్కకాటులో 159, కోతికాట్లు 8, పిల్లి కాట్లు 2, ఎలుక కాట్లు 8 మొత్తంగా 177 కేసులు కాగా 2026 జనవరి 25 వరకు కుక్క కాటులో 132, కోతికాట్లు 7, పిల్లి కాట్లు 9, ఎలుక కాట్లు 3 మొత్తంగా 145 గత నాలుగు నెలలుగా మహిళలు పిల్లలు ప్రజలపై ఈ కాట్లులకు గురైన వారు 567 పైబడి బాధితులు ఉన్నారు. అంటే ఇప్పటి వరకు ఒక 4 నెలల కాలంలోనే ప్రధానంగా సగానికి ఎక్కువ 300 మంది పసిపిల్లలు ఉండటం గమనార్హం.

**పొంచి ఉన్న రాబిస్ ప్రమాదం....**

ఇప్పటి వరకు వైద్య చికిత్సలో కుక్కకాటు కోతికాటుకు రేబిస్ రాకుండా వైద్యులు చికిత్స చేస్తున్నప్పటికీ రాబిస్ వ్యాధి అంటూ వస్తే దానికి చికిత్స లేదని వైద్యులు చెబుతున్నారు. అంటే కుక్కకాటు గురైన ఏ ఒక్క వ్యక్తికి రాబిస్ వ్యాధి వచ్చిన అతని పక్కన ఉన్నవారికి ఇంకా అనేక మందికి వచ్చే ప్రమాదం ఉన్నందున అతనిని అనివార్యంగా నిర్మూలించాల్సిన పరిస్థితి ఉంటుందన్న విషయం ప్రజలందరికీ తెలిసిందే. ఈ పరిస్థితిలో కూసుమంచి మండలానికి ర్యాబిష్ వ్యాధి ప్రమాదం ఉందని చెప్పటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. కనుక ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానికి ఉన్నప్పటికీ ప్రజలను పట్టించుకోకుండా అంతులేని మొద్దు నిద్రలో ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకోని పంచాయితీ పాలకవర్గాలు....**

మండలంలో 41 గ్రామ పంచాయితీలు ఉన్నప్పటికీ ప్రతి గ్రామ పంచాయితీలో కుక్క, కోతి కాట్లకు పసిపిల్లలు, మహిళలు, గురవుతున్న పరిస్థితుల్లో గత పంచాయితీలో పాలకవర్గాలు కాని నేడు ఎన్నికైన ఏ ఒక్క పంచాయితీ పాలకవర్గం కూడా ఇప్పటి వరకు ప్రజలను కాపాడటం కోసం సమర్థవంతమైన లేక నిర్దిష్టమైన ప్రణాళికతో గ్రామ ప్రజలను కుక్కకాటుల నుండి కాపాడాలని ఆలోచన విధానం లేకపోవడం దురదృష్టకరంగా మండల ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయితీ పాలకవర్గాలు అధికారులు ప్రజాప్రతినిధులు మండల వ్యాప్తంగా కదలకపోతే ప్రజలందరికీ ఒకరకంగా కోవిడ్ 19 వైరస్ లాంటి ప్రమాదం పరిణిగణించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు అని బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విచ్చలవిడిగా చికెన్, ఆహార, వ్యర్థాలు పడవేయుట....**

ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 41 గ్రామ పంచాయితీలో చికెన్ షాపు లేదు అనే గ్రామం లేనేలేదు, ఈ చికెన్ వ్యర్థాలను కుక్కలకు అందుబాటులో వేయడం వలన ఈ కుక్కలు పచ్చి మాంసం రక్తం రుచికి అలవాటు పడి వాటికి సరిపడినంత దొరకని సమయంలో పిల్లలు మహిళలు ఏదో సందర్భంలో వాటిని ఎదిరించినప్పుడు ఆ ఆకలి కసితో దాడి చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇంకా తిన్న ఆహార పదార్థాలు ముఖ్యంగా అన్నం కూరగాయాలు మొదలైనవి కూడా బయట విచ్చలవిడిగా అడ్డగోలుగా పడవేయడం వలన అటు కోతులకు కూడా అవకాశంగా తీసుకొని అవి వాటిని తింటూ వాటికి ఆకలి అయినప్పుడు మహిళల పసిపిల్లల దగ్గర ఏమైనా ఆహార పదార్థాలు ఉంటే తినే ప్రయత్నం చేసే క్రమంలో ఈ దాడులు చేస్తున్నాయి. అంతేకాకుండా వాహనాలపై వస్తున్న వారిని కోతులు కుక్కలు వెంబడించిన సమయంలో అటుట కాటుతో పాటు రోడ్డు ప్రమాదానికి గురై చనిపోతున్న పరిస్థితులు కూడా నెలకొనటం గమనార్హం ఈ పరిస్థితుల్లో సమాజంలో కాటుకు గురైన బాధితులు ఒక మానసికమైన భయంతో సమాజంలో జీవిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని చక్కదిద్దుకోలేకపోతున్నా దుస్థితి నెలకొంది.

**సమర్థవంతంగా లేని పారిశుద్ధ్యం నిర్వహణ....**

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా కుళ్ళిపోయిన ఆహార పదార్థాలు చికెన్ వ్యర్థాలు బజార్ల పొడవునా నిల్లలు ఉంచడం వల్లనే కోతులకు, కుక్కలకు ఆహార కేంద్రాలుగా మారి ఆ ప్రాంతం నుండి వస్తున్న ప్రజలపై కాట్లు వేస్తున్నాయని ప్రజలు చెప్పున్నారు. ఇప్పటికైనా అన్ని గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు సమర్థవంతంగా తమ విధులను నిర్వహించి వ్యర్థాలను తొలగిస్తే ప్రమాదాలు నుండి ప్రజలను కాపాడవచ్చు అని బాధిత ప్రజలు తెలుపుతున్నారు.

**పసిపిల్లల పరిస్థితి అత్యంత ఘోరం...**

ఇప్పటి వరకు మూడు నెలల కాలంలో జరిగిన ఈ దాడులలో పసిపిల్లలు(5 నుండి 8 సంవత్సరాల లోపు పిల్లలు)యాంటీ ర్యాబీస్ ఇంజక్షన్ల కోసం హాస్పిటల్ చుట్టూ తిరగటం ఏదైనా కారణాలతో క్రమం తప్పినట్లయితే పసిపిల్లలకు , పెద్దలకు, బారి ప్రమాదం ఉందని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వన్ హెల్త్ ప్రోగ్రాం పరిష్కారం....**

మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను(కోతులు, కుక్కల దాడుల నుండి)ప్రజల ఆరోగ్యం కాపాడుకోవడానికి వన్ హెల్త్ ప్రోగ్రామ్ పరిష్కారం మార్గమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ వన్ హెల్త్ ప్రోగ్రాం అనగా(ఎన్విరాన్మెంట్, హెల్త్, వెటర్నరీ)సరైన వాతావరణంలో పశువులను అడవి జంతువులను నిర్వహించడం వాటి దాడుల నుండి రక్షించుకోవడానికి వెటర్నరీ అధికారులు పరిశీలిన చేయటం ఒక వేళ దాడులకు గురైన ప్రజలకు వైద్యాధికారులు వైద్యం అందించడమే దీనికి పరిష్కార మార్గంగా ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు తమ అసమర్థతలను పక్కన పెట్టి మండల ప్రజల ఆరోగ్యాలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మైనస్ 30 డిగ్రీల తీవ్రమైన చలిలో దేశ సేవలో సింగరేణి మండల వాసి

- బెస్ట్ సోల్జర్ అవార్డు అందుకున్న పొలంపల్లి హావల్దార్ బానోత్ దశరథ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** దేశ సరిహద్దుల్లో మైనస్ 30 డిగ్రీల కఠినమైన చలిని సైతం లెక్కచేయకుండా భారత మాత సేవలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి మండల వాసి. పొలంపల్లి గ్రామానికి చెందిన హావల్దార్ బానోత్ దశరథ్ దేశానికి గర్వకారణంగా నిలిచారు. గత 17 సంవత్సరాలుగా భారత సైన్యంలో నిరంతరంగా సేవలందరిస్తున్న దశరథ్ విధి నిర్వహణలో చూపిన క్రమ శిక్షణ, ధైర్య సాహసాలు, దేశ భక్తికి గుర్తింపుగా ఆయనకు బెస్ట్ సోల్జర్ అవార్డు లభించింది. ఈ ఘనత సింగరేణి మండలంతో పాటు పొలంపల్లి గ్రామ ప్రజలను గర్వంతో ఉప్పొంగేలా చేసింది. ఇంతకు ముందు దశరథ్ జమ్మూ, కాశ్మీర్‌లోని పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో సేవలందిస్తూ, దేశ భద్రతకు ముప్పుగా మారిన ఉగ్రవాద శక్తులపై జరిగిన అనేక కీలక ఆపరేషన్లలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన చూపిన ధైర్యం, అప్రమత్తత, విధి పట్ల నిబద్ధత ఆయనను ఉత్తమ సైనికుడిగా నిలిపాయి. ప్రస్తుతం దేశ భద్రతకు అత్యంత సున్నితమైన ప్రాంతంగా భావించబడుతున్న సియాచిన్ ప్రాంతం సమీపంలోని చైనా సరిహద్దులో దశరథ్ విధులు నిర్వహిస్తున్నారు. తీవ్రమైన మంచు తుఫాన్లు, ఆక్సిజన్ కొరత, ప్రాణాంతక వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూనే దేశ రక్షణ బాధ్యతను అలసట లేకుండా నిర్వర్తిస్తున్నారు. దశరథ్ కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు, భార్య జమున, పిల్లలు సోహాన్ వీర్, శ్రీనిధి పొలంపల్లి గ్రామంలో నివసిస్తున్నారు. కుటుంబానికి దూరంగా ఉన్నా దేశమే తన కుటుంబమని భావించి ఆయన చేస్తున్న సేవలు గ్రామ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. హావల్దార్ బానోత్ దశరథ్‌కు లభించిన ఈ గౌరవం పొలంపల్లి గ్రామానికే కాకుండా సింగరేణి మండల ప్రజలందరికీ గర్వకారణంగా మారింది. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత ఆయనను అభినందిస్తూ, ఇలాంటి సైనికులే దేశానికి నిజమైన రక్షకులని కొనియాడుతున్నారు.

# కార్పోరేషన్‌పై పట్టు సాధిస్తున్న సిపిఐ

- కమ్యూనిస్టు పార్టీలో భారీ చేరికలు
- 50,43 డివిజన్ల నుండి 110 కుటుంబాలు చేరిక
- సర్వశక్తులొడ్డి కొత్తగూడెం కార్పోరేషన్‌ను కైవసం చేసుకుందాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పోరేషన్ పై సిపిఐ రోజురోజుకు పట్టు సాధిస్తోంది. గత గులాబీ హవాలోనూ కొత్తగూడెం మున్సిపాలిటీలో ఎనిమిది ప్రధాన వార్డుల్లో విజయం సాధించి సత్తా చాటిన సిపిఐ అసెంబ్లీ ఎన్నికల అనంతరం కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల పరిధిలో మరింత బలం పెంచుకుంది. కార్పోరేషన్ ఎన్నికల నేపథ్యంలో సిపిఐ మరింత దూకుడు పెంచింది. శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చొరవతో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ శ్రేణులు అందిస్తున్న సేవలు పార్టీ మరింత బాలోపేతం అవడానికి దోహదపడుతోంది. దీంతో కొత్తగూడెం డివిజన్ పరిధిలో చేరకల పరంపర కొనసాగుతుండగా మంగళవారం జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పోరేషన్ పరిధిలోని 50,43 డివిజన్లకు చెందిన 110 కుటుంబాలు జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా సమక్ష్యంలో సిపిఐలో చేరాయి. కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామాటాకీస్ ఏరియాలో 50వ డివిజన్‌కు చెందిన యెర్ర రాజు, తందూరి అరుణ్, కోసరబోయిన రమేష్, అజయ్, సలీం, శ్రీను, చంటి నేతృత్వంలో 60 కుటుంబాలు, 43వ డివిజన్‌కు చెందిన వెంకటేష్, అవినాష్, ప్రశాంత్, మురళీకృష్ణ, నాగమణి, వెంకటేశ్వర్లు నేతృత్వంలో 50 కుటుంబాలు సిపిఐలో చేరాయి. వీరికి సాబీర్ పాషా కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో సిపిఐకి ఎదురులేదని, త్వరలో జరగనున్న కార్పోరేషన్ ఎన్నికల్లో 60 డివిజన్ల నుండి ప్రజాదరణ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి పోటీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రతీ కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, పిడుగు శ్రీనివాస్, యాంత్ర మహేష్, బోయిన విజయ్ కుమార్, దాసరి శ్రీనివాస్, నరేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మూలన పడ్డ పంచాయతీ ట్రాక్టర్లు..!

-కొత్త పాలనలోనైనా.. ట్రాక్టర్లు కదిలేనా..?
-పంచాయతీ ఎన్నికలు అన్నారు. ఎన్నికలు ఐపోయాయి
-పంచాయితీ ట్రాక్టర్లలపై పట్టింపులేని పాలకులు, అధికారులు









**ప్రజాపక్షం/జూలూరుపాడు :** గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలకు చెత్త ట్రాక్టర్లను అందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాలు అందంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంది. కానీ ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్య పనులు కొనసాగ లేదు. చెత్త సేకరణ ట్రాక్టర్లు మరమ్మత్తులు చేపించక మూలాన పడ్డాయి. జూలూరుపాడు మండలపరిధిలోని నల్లభండబోడు, గాంధీనగ్, అనంతరం, మరికొన్ని పంచాయతీలలో గత సంవత్సరం నుండి గ్రామ పచాయతీ ట్రాక్టర్లు మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో గ్రామాల్లో చెత్త సేకరణ నిలిచిపోయి, పంచాయతీ ట్రాక్టర్లు దిష్టిబొమ్మలా మారాయి. ట్రాక్టర్ చెడిపోగా, దీన్ని రిపేర్ చేయించే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే వీటికి బాధ్యత వహించే సర్పంచులు రెండేళ్లు లేక ప్రత్యేక అధికారుల పట్టింపులేని పాలనలో దిగజారి పోయాయని స్పష్టంగా తెలుస్తుంది. ట్రాక్టర్ మరమ్మతులు చేయించాలని సంబంధిత పంచాయతీ అధికారులకు తెలిపినా కూడా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. ఏ అధికారి కూడా స్పందించకపోవడంతో ట్రాక్టర్ నిరుపయోగంగా మూలన పడినట్లు పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కొత్త పాలనలోనైనా.. ట్రాక్టర్లు కదిలేనా?**

కొత్త సర్పంచులు కొలువుదీరారు. ఇప్పటి నుంచి అయినా మూలన పడ్డ ట్రాక్టర్లు పారిశుద్ధ్యం కోసం, చెత్త సేకరణలో భాగంగా ట్రాక్టర్లు ఇంటింటికి తిరగడం జరుగుతుందా? అనే సందేహం గ్రామాల్లో ప్రజలకు కలుగుతుంది. పంచాయతీల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో జాప్యం జరగడంతో డీజిల్ కు డబ్బులు లేక పంచాయతీలలో నిధులు లేక, పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్లు తిప్పకుండా మూలన పడేశారు. గత కొంతకాలంగా కార్యదర్శులు సొంత డబ్బులతో ట్రాక్టర్ తిప్పిన సందర్భాలు కూడా లేకపోలేదు, ప్రస్తుతం డిజిల్ పోయించడానికి అప్పులు ఇచ్చేవారు లేక గ్రామాల్లో ట్రాక్టర్లు పారిశుద్ధ్యం కోసం తిరుగుతాయో లేదో అని అయోమయానికి గురవుతున్నారు.

**పంచాయతీ ఎన్నికల తర్వాత అన్నారు...**

ఎన్నికలు ఐపోయాయిపంచాయతీ ఎన్నికల అనంతరం కొత్త సర్పంచుల పాలనలో సమస్యలు చరమగీతం పాడేందుకు సొంత నిధులు వెచ్చించి గ్రామాల్లో ట్రాక్టర్లు తిప్పుతారా? లేక ప్రభుత్వం ట్రాక్టర్ల కోసం ప్రత్యేక నిధులు విడుదల చేసే వరకు సమస్యల పరిష్కారం కోసం వేచి చూస్తారా అన్నదే అంతుపట్టని ప్రశ్న. ఏది ఏమైనప్పటికీ మూలన పడ్డ ట్రాక్టర్లు బయట తిరగాలంటే ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు విడుదల చేస్తే తప్ప పరిష్కారం లభించే మార్గం లేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త సర్పంచులకు మారిన సమస్యల పై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

**పేరుకుపోతున్న చెత్త..**

గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు చెత్త సేకరణ లేకపోవడంతో దుర్గంధం నెలకొంది. క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగకపోవడం, గ్రామాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని పంచాయతీలలో వారంలో ఒకటి రెండు దఫా చెత్త సేకరిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఊరిబయటకే చెత్త తరలించి దహనం చేస్తున్నారు. కొందరు తమ ఇళ్లలోని చెత్తను స్వయంగా డంపింగ్ యార్డులకు తీసుకెళ్లి పడేస్తున్నారు.

# గ్రామ పంచాయతీని సందర్శించిన ఎంపీడీవో



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని మూకమామిడి గ్రామ పంచాయితీని మంగళవారం ఎంపీడీవో రామారావు సందర్శించారు. ముందుగా అసంపూర్తిగా ఉన్న నూతన పంచాయితీ కార్యాలయం భవనాన్ని పరిశీలించి, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి పంచాయితీ కార్యాలయాన్ని పంచాయితీ ప్రజలకు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లకు తెలిపారు. అనంతరం వైకుంఠధామాన్ని సందర్శించి వైకుంఠధామం చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, ఎదిగిన పిచ్చి మొక్కలు చెత్త శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. డంపింగ్ యాడ్ తడి చెత్త పొడి చెత్తను వేరు చేసే పద్ధతి, సేంద్రియ ఎరువు తయారీ వంటివి పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కేసుపాక శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని ఆనందపురం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు ట్రాక్టర్ల ఇసుకను ములకలపల్లి ఎస్ఐ మధుప్రసాద్ గుర్తించారు. ఈ ఐదు ట్రాక్టర్ల ఇసుకను తగు చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# సీఎం కప్ మండల స్థాయి క్రీడలను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ముఖ్యమంత్రి కప్2026 మండల స్థాయి క్రీడలను విజయవంతం చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి క్రీడల బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పల్లె నుంచి ప్రపంచ స్థాయిలో క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోటీల వలన గ్రామీణ ప్రాంతాలలో దాగి ఉన్న క్రీడా ప్రతిభవెలుగులోకి వస్తుందని అన్నారు. ఈ నెల 30న బాలుర, 31న బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో విజేతలను జిల్లా స్థాయి కి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూసహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, పీఈటీలు అన్నపూర్ణ, రామకృష్ణ. సోడెపొంగు ప్రశాంత్ పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతర ఫ్లెక్స్ ఏర్పాటు



**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ కుంభమేళా, ఆసియా ఖండంలోనే అతిపెద్ద 2 జాతర, గిరిజనుల ఆరాధ్య దేవతలు, పోరాట పటిమకు నిదర్శమని ప్రతి 2 సంవత్సరాలకు జరిగే సమ్మక్క సారలమ్మల జాతరకు సంబంధించిన గోడ పత్రాలను, ఫ్లెక్సీలను భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి 31 వరకు జరుగుతుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మకంగా పనులు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా, అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని, వారి కృపకు పాత్రులు అయ్యి వారి పోరాట పటిమ పునికి పుచ్చుకోవాలని తెలిపారు. వారి ఆదర్శంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అనిల్ కుమార్, వార్డు సభ్యులు గాంధీ, జీపీఎస్ సామ్యాతండ ఉపాధ్యాయులు బాలాజీ, యూత్ నాయకులు లావుడ్య నగేష్ భద్ర, పంచాయితీ సిబ్బంది హెంచంద్, రాందాస్, రమేష్, గణేష్, రాధ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/పాల్వంచ :** కేటిపిఎస్ జెన్‌కో గ్రేడ్3 ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న పాల్వంచ రాహుల్ గాంధి నగర్‌కు చెందిన ఎడెల్లి సైదులు మంగలవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. రోజు వారీ విధులకు వెళ్ళే క్రమంలో ఒక్కసారిగా గుండె నొప్పి రావటంతో కుటుంబీకులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. దీనితో జెన్‌కో విభాగంలో పనిచేస్తున్న డిఈ వెంకటక్రిష్ణ ప్రసాద్, ఏఈలు శ్రీనివాస్, కొల్లారావు, రఘువీర్‌లు కలిసి తక్షణమే మృతుడి భార్య రూ.30 వేయిలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# బ్యాంకు ఉద్యోగుల ఆందోళన




**-ఐదు గంటల పనిదినానికై డిమాండ్**
**-ఖమ్మంలో ప్రదర్శన**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఐదు గంటల పనిదినానికై బ్యాంకు ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. యూనైటెట్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వైరా రోడ్డు ఎదుట బ్యాంకు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. అంతకు ముందు వైరా రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని అన్ని బ్రాంచీల నుంచి ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. సమ్మెను ఉద్దేశించి ఎఫ్‌బియు నాయకులు మాట్లాడుతూ పదేళ్ల నుంచి ఐదు రోజుల పనిదినం అమలు జరపాలన్న డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 2024 లో అమలైన 12వ వేతన సవరణ ఒప్పందంలో కూడా ఐదు గంటల పనిదినాన్ని చేర్చడం జరిగిందని అయినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ అంశంపై పలుమార్లు సమావేశం జరిపి ఆర్థిక శాఖకు పంపించడం జరిగిందని అయినా స్పందన కరువైందన్నారు. జనవరి 22, 23 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో బ్యాంకు ఉద్యోగులతో కలిసి సమ్మెకు పిలుపునిచ్చాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఎఫ్‌బియు నాయకులు షేక్ ఇబ్రహీం, రాంబాబు, రాజేష్, శివకుమార్, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, మంగయ్య తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు ఏఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహలక్ష్మి, సిఐటియు నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు లు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలో పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో పర్యటించిన ఎమ్మెల్యే జారె



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాల్టీలో శాసనసభ్యులు జారె ఆదినారాయణ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజలకు దగ్గరగా ఉండే కాంగ్రెస్ పార్టీ పాలన, అభివృద్ధి దృక్పథం, సంక్షేమ కార్యక్రమాలు అమలు పట్ల ఆకర్షితులై బిఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని కొత్తగా చేరిన నాయకులు వెల్లడించారు. ఎమ్మెల్యే జారె వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, పేదల కోసం రైతుల కోసం, మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని, అశ్వారావుపేట అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేసే ప్రతి ఒక్కరికి కాంగ్రెస్‌లో సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే మున్సిపాలిటీ అభివృద్ధిపై మాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజ్ రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రజలకు దగ్గరగా ఉండే విధానం సమస్యలపై స్పందించే తీరే తమను ఆకట్టుకుందని తెలిపారు. ఆయన నాయకత్వంలో అశ్వారావుపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సంకపెల్లి వీరభద్రరావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, నండ్రు రమేష్, జూపలి ప్రమోద్, ఫణి, కానూరి మోహన్‌రావు, వెలుపుల సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

**-ప్రభుత్వ కార్యాలయాల్లో 3 చోట్ల నామినేషన్ల స్వీకరణ**
**-వైరా మున్సిపాలిటీ ఎన్నికలకు ఏడుగురు రిటర్నింగ్ అధికారులు**




**ప్రజాపక్షం/వైరా:** మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి11వ తేదీన జరగనున్న వైరా మున్సిపాలిటీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. మున్సిపాలిటీ3ఈ 20 వార్డుల్లో నామినేషన్లను స్వీకరించేందుకు వార్డుల వారీగా మూడు ప్రభుత్వ కార్యాలయాల్లో నామినేషన్ ప్రక్రియ ఏర్పాటు చేశారు. మున్సిపాల్ ఎన్నికలకు సంబంధించి 7 ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. మొత్తం 20 వార్డులను ఏడు భాగాలుగా విభజించి అధికారులను కేటాయించారు. 1,2,3 వార్డులకు రిటర్నింగ్ అధికారిగా కె.రమేష్‌రాజు, 4,5,6 వార్డులకు రిటర్నింగ్ అధికారిగా ముళ్ళపూడి రాంబాబు, 7,8,9 వార్డులకు రిటర్నింగ్ అధికారిగా సిహెచ్.నాగేశ్వరరావు, 10,11,12 వార్డులకు రిటర్నింగ్ అధికారిగా టి.అనిల్‌కుమార్, 13,14,15 వార్డులకు రిటర్నింగ్ అధికారిగా టి.పూర్ణచంద్రరావు, 16,17, 18 వార్డులకు రిటర్నింగ్ అధికారిగా దొండపాటి శ్రీనివాస్, 19,20 వార్డులకు రిటర్నింగ్ అధికారిగా బి.శ్రీమన్నారాయణలను నియమించారు. మున్సిపాలిటీలోని 1,2,3,4,5,6,13,14,16 వార్డులకు సంబంధించిన నామినేషన్లను వైరా లోని మండల పశు వైద్యశాఖ సమీపం లో ఉన్న నియోజకవర్గస్థాయి రైతు శిక్షణ కేంద్రంలో స్వీకరిస్తారు. 7,8,9, 10,11,12 వార్డులకు సంబం ధించిన నామినేషన్లను వైరా తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో అధికారులు స్వీకరించనున్నారు. 16,17,18,19,20 వార్డులకు సంబంధించిన నామినేషన్లను ఎంపిడివో కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో స్వీకరించనున్నారు. అదేవిధంగా ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ సెంటర్‌ను, పోలింగ్ బాక్సులు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను, ఎన్నికల కౌంటింగ్‌ను వైరాలోని నియోజకవర్గస్థాయి రైతు శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్నారు.

## మోగిన మున్సిపల్ నగారా

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** నూతనంగా ఏర్పడ్డ అశ్వారావుపేట మున్సిపాల్టీలో ఎన్నికల నగరా మోగింది. నూతనంగా ఏర్పడి మున్సిపాల్టీలో 22 కౌన్సిల్ వార్డులకు నామినేషన్లు జరగనున్నాయి. నేటి నుంచి 30 తేదీ వరకు నామినేషన్లు జరుగుతాయని, 31న నామినేషన్ పత్రాలు పరిశీలన, ఫిబ్రవరి 1న నామినేషన్ల అభ్యర్థుల స్వీకరణ, ఫిబ్రవరి 2న అభ్యంతరాల పరిష్కారం, 3న ఉపసంహరణలు, ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు, 16న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక జరుగుతుందని మున్సిపల్ షెడ్యూల్ వెలువరించింది.నూతనంగా ఏర్పడ్డ అశ్వారావుపేట మున్సిపాల్టీలో మొత్తం ఓట్లు 16,850 ఉండగా వీటిలో అత్యధికంగా మహిళా ఓట్లు కలిగి ఉన్నాయి. 8761 మహిళా ఓటర్లు ఉండగా 8085 ఓట్లు పురుషులు, 4ఓట్లు ఇతరులు కలిగి ఉన్నారు. ఇప్పటికే కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీలు కూటమిగా ఏర్పడి అభ్యర్థుల జాబితాను తయారు చేసి నామినేషన్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా టిఆర్‌ఎస్ టిడిపి జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి అభ్యర్థుల జాబితాను తయారు చేసి అభ్యర్థులను సిద్ధంగా ఉంచారు. రెండు కూటముల్లో పార్టీ అభ్యర్థులను ప్రకటించి నామినేషన్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

# మహాశివరాత్రి పనులు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం స్నానాల లక్ష్మీ పురం గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పలు, అభివృద్ధి పనులను పరిశీలించి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మహాశివరాత్రి జాతరకు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు, మల్లు రామకృష్ణ, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆదర్శ రైతుకు సన్మానం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆదర్శ రైతుగా ఎంపికైన భూక్యా హర్యాను గ్రామస్తులు సన్మానించారు. మండల పరిధిలోని వి.ఆర్ బంజర గ్రామానికి చెందిన భూక్యా హర్యా వైవిధ్యభరితమైన వివిధ రకాల పంటలను సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. రైతు హర్యా బంతి, చామంతి, గులాబీ, మల్లెలు, కనకాంబ్రాలు వంటి పూల సాగుతో పాటు బొప్పాయి, మిర్చి సాగు చేశాడు. క్షేత్ర స్థాయిలో ఉద్యానవన శాఖాధికారులు పరిశీలించి మండల ఉత్తమ ఆదర్శ రైతును హర్యాను ఎంపిక చేసి గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో అధికారుల చేతుల మీదుగా ఆదర్శ రైతుగా ప్రశంస పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆదర్శ రైతుగా నిలిచిన భూక్యా హర్యాను సర్పంచ్ భూక్యా రమణ, స్థానిక పెద్దలు, గ్రామస్తులంతా కలిసి సన్మానించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఆదర్శ రైతుగా ఎంపిక కావడం తమకు ఎంతో గర్వకారణమని సర్పంచ్ భూక్యా రమణ తెలిపారు. ఆదర్శ రైతుగా ఎంపిక కావడం పట్ల చాలా సంతోషంగా ఉందని హర్యా తెలిపారు. ఇటువంటి ప్రోత్సాహం రైతులకు ఎంతో దోహదపడుతుందన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి పంపిణీ




**ప్రజాపక్షం/తల్లాడ :** సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రానికి వస్తు సామగ్రిని పంపిణీ చేశారు. మంగళవారం సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్ బాబు మేనకోడలు దేవశ్రీ పుట్టిన రోజు సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి రూ. 10వేల విలువైన కుర్చీలు, వాటర్ క్యాన్లు, కుక్కర్ మొదలైన వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడివో ఏనుగు సురేష్‌బాబు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన వస్తువులను సమకూర్చడం ఎంతో అభినందనీయమన్నారు. ఏనుగు సుమన్‌బాబు మాట్లాడుతూ తాము అందించిన వస్తువులు పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతిదాస్, సంస్థ ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తు చేసుకున్న వీరంశెట్టి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 13వ వార్డు మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కౌన్సిలర్‌గా అవకాశం కల్పించాలని పట్టణ కాంగ్రెస్ నాయకుడు వీరంశెట్టి సీతారాములు సతీమణి వీరంశెట్టి దుర్గాభవాని దరఖాస్తు సమర్పించుకోవడం జరిగింది. అదేవిధంగా వీరంశెట్టి సీతారాములు 5,8 వార్డుల్లో తనకు అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొళ్ళ గంగారావు, నారపనేనిపల్లి సర్పంచ్ శీలంచంద్రశేఖర్‌రెడ్డి, గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాసరావు, కొణతం రాజారావు, మురిశెట్టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# గౌడజనుల హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నూతన కమిటీ ఏర్పాటు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల గౌడజనుల హక్కు పోరాట సమితి మోకుదెబ్బ మండల అధ్యక్షులుగా మదుపల్లి రాంబాబు గౌడ్, ప్రధాన కార్యదర్శి కోసూరి రామకృష్ణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దప్రోలు వెంకటరామకృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడు కొనకాల వెంకటేశ్వర్లు గౌడ్, గౌరవ అధ్యక్షుడు మదుపల్లి నాగేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్లు మదుపల్లి గోపి, కొనకాల మురళీకృష్ణలను ఖమ్మం జిల్లా మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు బండి నాగేశ్వరరావుగౌడ్ చేతులమీ దుగా మంగళవారం ఉదయం 11 గంటలకు వైరా మండల కేంద్రంలో నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా మోకుదెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ దావా ముత్యాలరావు గౌడ్, ఖమ్మం జిల్లా గౌరవ సలహాదారుడు అనుబోతు రామకృష్ణ గౌడ్, కొణిజర్ల మండల అధ్యక్షుడు పెద్దప్రోలు నాగేశ్వరరావు గౌడ్, మదుపల్లికృష్ణ పాల్గొన్నారు.

# సిపిఐలో పలు కుటుంబాల చేరిక

**- ఎంఎల్ఏ కూనంనేని నేతృత్వంలో అభివృద్ధి చేసుకుందాం**
**- కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి : ముత్యాల**



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం కార్పోరేషన్ ఏడవ డివిజన్ వనమా కాలనీకి చెందిన 50 కుటుంబాలకు చెందిన వారు బండి రమణి ఆధ్వర్యంలో మంగళవారం సిపిఐ ( భారత కమ్యూనిస్టు పార్టీ ) లో చేరారు. ఈ సంధర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విశ్వనాథం మాట్లాడుతూ పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకొంటామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారు పార్టీ ప్రజా సంఘాలలో చేరి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కొత్తగూడెంలో శాసనసభ్యులు కూనంనేని చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులవుతూ పెద్ద ఎత్తున సిపిఐలో చేరుతున్నారని అన్నారు. ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇప్పటికే కోట్లాది నిధులతో పలు అభివృద్ధి పనులను చేపట్టారని చెప్పారు. కార్పోరేషన్ ఎన్నికలలో సిపిఐ, మిత్ర పక్షాలు బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంఎల్ఏ నేతృత్వంలో నియోజక వర్గాన్ని, పాల్వంచను మరింత అభివృద్ధి చేసుకొందామని అన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు,జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, ఇట్టి వెంకట రావు, కోరె క్రిష్ణ, రైతుసంఘం నాయకులు వైఎస్. గిరి, శాఖ కార్యదర్శి బాబూరావు, సహాయ కార్యదర్శి గణేష్, పావురాల రామతులసి, దుర్గా, సావిత్రమ్మ,బోడ జ్యోతి, బొంతు నాగలక్ష్మి, బొంతు శారద, ముదిగొండ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సరిపడ మందులు అందుబాటులో ఉన్నాయి..

**-ప్రభుత్వ హస్పిటల్‌లో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు**
**-జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ హస్పిటల్స్ లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీయంఅండ్ హెచ్వ్) డాక్టర్ డి.రామారావు పేర్కొన్నారు. మండలం లోని చెరువుమాధారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యం కోసం వచ్చిన పేషంట్స్ ను సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న షెడ్ పనులను పరిశీలించారు. నేలకొండపల్లి నుంచి పీహెచ్సీ ని చెరువుమాధారం కు తరలించిన తరువాత సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అవసరమైన తాత్కాలిక మరమ్మతుల గురించి చర్చించారు. పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ హస్పిటల్ లో కార్పోరేట్ స్థాయి లో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా లో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రోగులకు మందుల కొరత లేదన్నారు.



చెరువుమాధారం పీహెచ్సీ ని కొత్తగా ఏర్పాటు చేసిన తరువాత ప్రతీ రోజు 60 మంది కి పైగా పేషెంట్స్ వస్తున్నారని పేర్కోన్నారు. అన్ని రకాల వైద్య సేవలు సంపూర్ణంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దగ్గు జిల్లా వ్యాప్తంగా ఎక్కువగా ఉందన్నారు. చలి తీవ్రత తగ్గిన తరువాత తగ్గే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ హస్పిటల్స్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్ కూమార్, వైద్యాధికారులు డాక్టర్ సన, డాక్టర్ నాగమణి సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో కౌన్సిలర్ సీటుపై మెట్టు దిగని నేతలు

**-పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్న ఆశావహులు**
**-నాదంటే నాదే సీటు అంటున్న కౌన్సిలర్ అభ్యర్థులు**
**-రహస్య సమావేశాలు పెడుతున్న నేతలు**






**ప్రజాపక్ష/వైరా:** వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీలో పెద్ద అలజడిని కనబడుతుంది. ప్రతి వార్డులో పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున పోటీపడుతున్నారు. 10 సంవత్సరాల తర్వాత కాంగ్రేస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలో పోటీ చేసేందుకు ఆశావాహులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారు. సిట్టింగ్ స్థానాల్లో కూడా పోటీ చేసేందుకు ఇతరులు రావడంతో సిట్టింగ్ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నట్లు తెలుస్తుంది. 2,3,4,7,8,12,13 వార్డుల్లో పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున ఆశావాహులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రేస్ పార్టీలో ఇప్పటికే మూడు వర్గాలుగా వైరాలో పార్టీ ఉంది. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గాలు వైరాలో ఉన్నాయి. ఈ క్రమంలో స్థానిక శాసనసభ్యులు, జిలా లపార్టీ అధ్యక్షులు మాజీ అద్యక్షుడు ఎవరికి సీటు కేటాయించాలి. ఏ విధంగా ఉంటుంది అనే దానిపై కూడా పూర్తిస్థాయిలో సమాలోచన చేస్తున్నారు. మరోపక్క కాంగ్రేస్ పార్టీ ఆశావాహులను కౌన్సిలర్‌గా పోటీ చేయడానికి పోటీ పడుతున్న వారిని దరఖాస్తు చేసుకోమనడంతో ఆ పార్టీలో మరింత ఉత్కంఠట లేపుతుంది. కీలకమైన వార్డుల్లో గెలిచే అర్హత ఉన్న సిట్టింగ్‌లకు స్థానం ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఇండిపెండెంట్‌లు పోటీ చేసే ప్రమాదం కూడా ఆ పార్టీని వెంటాడుతుందని తెలుస్తుంది. ఇప్పటికే కాంగ్రేస్ పార్టీలో ఏం జరుగుతుందో అనేది కార్యకర్తలు కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. సీటు రాకపోతే ఏం చేయాలిఏ విధంగా ముందు పోవాలి అనే దానిపై కూడా మరి పెద్ద ఎత్తున రహస్య సమావేశాలు కూడా పెడుతున్నారు. ఈ సమావేశంలో ఎవరికి వారే వారి అనుచరులను పిలుచుకొని టిక్కెట్లపై ఆటోచన చేస్తున్నారు. టిక్కెట్ రానిపోంలో ఏం చేయాలి ఏ విధంగా ముందుకు పోవాలి అనే దదానిపై సమాలోచన చేస్తున్నారు. ఎక్కువ మంది టిక్కెట్ రాణి పోంలో ఇండిపెండెంట్‌గా పోట ఈచేయాలనే వాదనలో ఉన్నట్లు కూడా తెలుస్తుంది. ఎందుకంటే 10 సంవత్సరాలు పార్టీలో కష్టాలు నష్టాలు ఎదుర్కొన్న అధికారంలోకి వచ్చిన తర్వా తెందుకు పోట ఈచేసేందుకు సీటు ఇవ్వరని ప్రశ్నిస్తుంటే మరికొందరు వార్డులో బలమైన నాయకత్వాన్ని కలిగి ఉన్నాం ప్రజలకే సర్వీస్ చేశాం ప్రజలు మనతోనే ఉన్నారు. మనమే పోటీ చేద్దామని వాదనలో మరి కొంతమంది ఉన్నారు. కొంతమంది సిట్టింగ్‌లను ప్రజలు మరల మీరే నిలబడాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దానికి తోడు వారికి రిజర్వేషన్లు కూడా కలిసి రావడంతో పోటీలో ఎట్టి పరిస్థితుల్లో ఉంటామని ప్రజలకు తెలుపుతున్నారు. ఏది ఏమైనప్పనటికి వైరా మున్సిపాలిటీలో కాంగ్రేస్ సీట్లు కేటాయింపు నాయకులకు పార్టీ నాయకులకు తలనొప్పిగా మారింది.

# పూజలతో ఘరానా మోసం

**-మీకు పట్టిన శని వదలాలా...దోశం పోవాలా...**
**రాజ గురువుల పేరుతో... దందాకు తెగబడిన వైనం**
**-గ్రామస్తుల ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మీ ఇంట్లో దోషం ఉంది. మీ కుమారుడు కు పిల్లలు కలగలేదా, మీకు పట్టిన శని పోవాలంటే తాయత్తు కట్టాలి. లేకుంటే కీడు జరుగుతుందని, పజలను భయపెట్టి, ఒదా కు పాల్పడుతున్న వారిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి కి రాజగురువులు వస్తున్నారని, పూజలు చేస్తే మీకు, మీ కుటుంబాలకు మంచి జరుగుతుందని, సోమవారం రాత్రి చాటింపు వేయించారు. దీంతో గ్రామస్తులు జలబిందెలు తో స్వాగతం పలికేందుకు మంగళవారం సిద్ధమయ్యారు. రాజ గురువులుగా చెప్పుకునేవారు. సినిమా సెటింగ్ స్థాయిలో ఓ గుర్ర, ఓ డీసీఎం లో సూర్యాపేట కు చెందిన ఐదుగురు రాజ గురువులు పేరుతో గ్రామంలోకి ప్రవేశించారు. దీంతో కొంత మంది వారికి స్వాగతం పలికారు. ఇదే అదునుగా భావించి వారు పిలవకున్నా ఇంటి ముందు కు వెళ్లి మీ ఇంట్లో దోషం ఉందని, దోష నివారణ చేయకుంటే, మీకు కీడు జరుగుతుంది. ప్రమాదం పొంచి ఉందని ప్రజలను భయపెట్టారు. మరి కొంత మంది ఇళ్ల కు వెళ్లి మీకు పట్టిన శని పోవాలంటే తాయత్తు కట్టించుకోవాలని లేకుంటే మీకు తీరని నష్టం జరుగుతుందని వారినిభయపెట్టారు. మరో ఇంటికి వెళ్లి మీ కుమారుడు కు పిల్లలు కలగకపోవటం కు దోషం కారణమని, ఆ దోషం వెళ్లి పోయేలా పూజలు చేస్తానని చెప్పటం తో భయపడి ఓ మహిళ రూ.2 వేలు చెల్లించింది. ఇలా గ్రామంలో ప్రతీ ఇంటి ని భయపెట్టేలా రాజ గురువులు సంచరించటంతో గ్రామస్తులకు అనుమానం వచ్చి వారిని నిలదీశారు. వారు చెప్పే మాటలకు పొంతన లేకపోవటంతో స్థానికులు 100 కు ఫిర్యాదు చేయటంతో స్థానిక పోలీసులు ఐదుగురు ను అదుపు లోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం ఐదుగురు పై కేసు నమోదు చేశారు.

# ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా సమ్మె నోటీసును ఇల్లందు ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బందికి అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా నాయకులు కే మరియా, షేక్ ఫాతిమా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబిలు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారని, కార్మిక చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్లు తెచ్చారని దానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయపద్రం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# ఎన్నికల నిర్వహణకు సిద్ధం

**- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ రావు**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల రావు అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌కు ఐడిఓసి నుండి పాల్గొన్న ఆయన జిల్లాలో ఎన్నికల పరిస్థితిపై ద్వారా వివరించారు. జిల్లాలో కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో 60 డివిజన్లు, ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నికల నిర్వహణకు పూర్తి సన్నద్ధంగా ఉన్నామని వివరించారు. ఇందులో భాగంగా వెబ్కాస్టింగ్, నోడల్, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో పాటు పిఓలు, ఓపిఓల నియాకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణి, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నామని, సమన్వయంతో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమలో జెడ్పి సిఇఓ నాగలక్ష్మి , మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ సుజాత, ఎన్నికల నోడల్ అధికారులు బాబూరావు, త్రినాధ్ బాబు, రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 20వ వార్డు నుంచి వుంద్రు వరలక్ష్మి




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20,1 వార్డుల్లో కాంగ్రేస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు వుంద్రు శ్యామ్ బాబు, వుంద్రు వరలక్ష్మి దంపతులు సిద్ధంగా ఉన్నారు. లయన్ ఐ కేర్ హాస్పిటల్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతులు సిద్ధంగా ఉన్నారు. లయన్ ఐ కేర్ హాస్పిటల్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరికి అండగా ఉంటున్న వుంద్రు శ్యామ్‌బాబు సతీమణి వుంద్రు వరలక్ష్మి 20 నుండి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా వుంద్రు శ్యామ్‌బాబు 1వ వార్డు నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు జరిగిన ఆశావాహుల అప్లికేషన్ల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న శ్యామ్‌బాబు , వరలక్ష్మి దంపతులు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వుంద్రు శ్యామ్‌బాబు మాట్లాడుతూ కాంగ్రేస్ పార్టీ పెద్దలు అవకాశం కల్పిస్తే వరలక్ష్మి 20వ వార్డు నుంచి 1వ వార్డు నుంచి వుంద్రు శ్యామ్ బాబు అను నేను పోటీ చేస్తామని ప్రజాక్షేత్రంలో ప్రజల మద్య ఉండేందుకు కాంగ్రేస్ పార్టీ పెద్దలు అవకాశం కల్పించాలని కోరారు.

# మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల సందడి







- అమల్లోకి ఎన్నికల కోడ్
- నేటి నుండి 30 వరకు నామినేషన్లు
- ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌటింగ్
- 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక
- జిల్లాలో వేడెక్కిన ఎన్నికల హడావుడి




ప్రజాపం/కొత్తగూడెం : మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రెండో సాధారణ ఎన్నికల సందడి జిల్లాలో మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం విధివిదాను సారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. మణుగూరు మున్సిపాలిటీ ఉన్నప్పటికీ అది ఆవిర్భవించిన నాటి నుండి కోర్టు చిక్కులతో ఎన్నికల జరగడం లేదు. ఈ సారి కూడా అదే పరిస్థితి ఏర్పడింది. కాగా కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లెందు మున్సిపాలిటీ, అశ్వారావు పేట మున్సిపాలిటీలకు వచ్చే నెల ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయి.

**నేటి నుండి నామినేషన్లు :**

మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలకు సంబంధించి నేటి 28వ తేది నుండి 30వ తేది వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు, జనవరి 31న అభ్యర్థుల నామినేషన్లు పరిశీలిస్తారు. ఫిబ్రవరి 1న నామినేషన్లపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 2న అభ్యంతరాలపై చర్చ, పరిష్కారం, 3న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఫిబ్రవరి 11వ తేది ఎన్నికలు నిర్వహించనుండగా, 13వ తేదిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. 16వ తేదిన కార్పోరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నిక చేస్తారు. ఇదిలా ఉండగా ఎక్కడైనా పోలింగ్‌కు సంబంధించి ఇబ్బందులు తలెత్తితే 12వ తేదీని ఆయా డివిజన్ల పరిధిలో రీ పోలింగ్ నిర్వహిస్తారు. .

**మహిళా ఓటర్లే అధికం :**

కార్పోరేషన్, మున్సిపాలిటీలకు సంబంధించి పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉండగా, 134744 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 70314 మంది మహిళలు, 64431 మంది పురుష ఓటర్లు ఉన్నారు. ఇల్లెందు మున్సిపాలిటీ 24 డివిజన్ల పరిధిలో మొత్తం 33723 మంది ఓటర్లకు గానూ మహిళలు 17469, పురుషులు 16622 మంది ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 డివిజన్లలో 16850 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు 8761 మంది, పురుషులు 8085 మంది ఉన్నారు.

**ఊపందుకున్న హడావిడి :**

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల హడావిడి మరింత ఊపందుకుంది. ఇప్పటికే ఆయా ప్రధాన రాజకీయ పార్టీలు వారివారి అభ్యర్థులను పోటీలో నిలిపేందుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో రాజకీయ వేడి రసవత్తరంగా సాగుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ పీఠాన్నికైవసం చేసుకునేందుకు తహతహలాడుతుండగా ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సిపిఐ అదే తరహాలో ముందుకు దూసుకుపోతోంది. గడిచిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో అనూహ్యమైన విజయాలను సిపిఐ తన ఖాతాలో వేసుకోగా, సిపిఐ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారు. ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో సత్తా చాటేందుకు పావులు కదుపుతోంది. అశ్వారావుపేట, ఇల్లెందు మున్సిపాలిటీల్లో సైతం ఇదే తరహా రాజకీయ వేడి కొనసాగుతోంది.

## 18వ విడత ప్రజావేదిక సామాజిక తనిఖీ

-18 గ్రామ పంచాయితీలకు రికవరీ, పెనాల్టీలు 39వేలు




ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మం డల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జమలారెడ్డి అధ్యక్షతన మంగళవారం 18వ విడత ప్రజావేదికలో మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయితీలలో నిర్వహించిన సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించి, గ్రామ సభలు నిర్వహించిన అనంతరం సంబంధిత నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ప్రతి పంచాయితీలోనే డిమాండ్ నో డిమాండ్ అనేది చూపకపోవడం సర్వ సామాన్యమైంది. అలాగే పని జరిగిన ప్రదేశంలో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ఆడిట్ అధికారులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కొంత మంది పని చేసినప్పటికీ వారికి నేటికి వారి ఖాతాలో నగదు జమ కాలేదని అధికారుల ముందు ఉంచారు. అలాగే పని వేతనం కంటే అదనంగా చెల్లించినట్లు గుర్తించారు. ఉదయం 10గంటలకు ప్రజావేదిక ప్రారంభమైనప్పటికీ సకాలంలో కార్యదర్శులు హాజరు కాకపోవడంతో ఏపిడి రవి అసహనం వ్యక్తం చేశారు. ప్రజా వేదికలో అదనపు డిఆర్‌డిఓ రవి అవకతవకలను వెల్లడించారు. రికవరీ, పెనాల్టీ మొత్తంగా 39409 రూపాయలు విధించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డివిఓ రమణ, ఆడిట్ బృందం ఇంచార్జ్ అనూష, పంచాయితీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చైర్‌పర్సన్ రేసులో బొర్రా ఉమాదేవి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకి పరిణామాలు మారుతున్నాయి. రాజకీయ కుటుంబం ప్రజలకు సేవలు అందించిన కుటుంబం బొర్రా కుటుంబం. అలాంటి బొర్రా కుటుంబం నుండి మాజీ జెడ్పిటిసి బొర్రా ఉమాదేవి మున్సిపాల్ ఎన్నికల బరిలో నిలిచేందుకు మూడో వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. సీనియర్ రాజకీయ నాయకులు స్వర్గీయ బొర్రా వెంకటేశ్వరరావు పంచాయతీ సర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించారు. బొర్రా వెంకటేశ్వరరావు సతీమణి బొర్రా పద్మావతి సర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించారు. అనంతరం బొర్రా వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతుల పెద్ద కుమారుడు బొర్రా రాజశేఖర్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర సంపాదించుకున్నాడు. రాజశేఖర్ సతీమణి బొర్రా ఉమాదేవి వైరా జెడ్పిటిసిగా పనిచేశారు. రాష్ట్ర రాజకీయాల్లో బొర్రా రాజశేఖర్‌కు ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రథమ అనుచరుడిగా, జిల్లాలో ఆయనకు పేరుంది. మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్‌గా, వైరా సొసైటీ చైర్మన్‌గా రాజశేఖర్ పనిచేశారు. ప్రస్తుతం వైరా మున్సిపాలిటీలో జరగనున్న మున్సిపాల్ ఎన్నికల్లో మున్సిపాల్ చైర్మన్ జనరల్ మహిళ అయింది. ఉమాదేవి మూడో వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి మున్సిపాల్ బరిలో ఉండేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. అందులో భాగంగానే కాంగ్రెస్ పెద్దలను తనకు కేటాయించాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీలో అన్యోన్య పరిణామాలు చోటు చేసుకున్నాయి.

# సత్తుపల్లి చైర్మన్ కుర్చీ చుట్టూ రచ్చ..!




**కాంగ్రెస్ జెండా పట్టినోళ్ళకు చైర్మన్ పదవి కావాలంట**

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ పదవి ఈసారి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో, ఆ కుర్చీ చుట్టూ రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. అయితే ఈ వేడి ఆశావాహుల పోటీ కంటే ఎక్కువగా, కాంగ్రెస్ పార్టీ లోపలి అసంతృప్తిని, ప్రజల్లో అసహనాన్ని బయటపెడుతోంది. ఎన్నాళ్లుగా కాంగ్రెస్ జెండా పట్టి,"జై కాంగ్రెస్" అంటూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు కాదుఎన్నడూ కనిపించని, ప్రజలను పలకరించని, సేవా కార్యక్రమాల్లో పాల్గొనని వ్యక్తుల పేర్లు చైర్మన్ రేసులో వినిపించడమే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన "కొత్త ముఖాలు"రిజర్వేషన్లు ఖరారైన నాటి నుంచే సత్తుపల్లిలో రాజకీయ దృశ్యం మారిపోయింది. ఇప్పటి వరకు ఏనాడు పార్టీ కార్యక్రమాల్లో కనిపించని కొందరు వ్యక్తులు, నేడు ప్రతి సమావేశం, ప్రతి కార్యక్రమంలో తళుక్కున మెరుస్తుండటం పార్టీ వర్గాల్లోనే ప్రశ్నలకు దారితీస్తోంది."ఇన్నాళ్లూ ఎక్కడున్నారు?" "పార్టీ కష్టకాలంలో ఎవరు నిలబడ్డారు?" "డబ్బు ఉంటే చాలు సేవ అవసరం లేదా?"అనే ప్రశ్నలు కార్యకర్తల నోట వినిపిస్తున్నాయి.

**కష్టపడిన కార్యకర్తల ఆవేదన..**

గత ప్రభుత్వ కాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం ఒత్తిడులు ఎదుర్కొంటూ, ప్రభుత్వ వ్యతిరేక వాతావరణంలో కూడా జెండా పట్టి నిలబడ్డ వారు ఈ రోజు తమను పక్కన పెట్టి, కొత్తగా వచ్చిన వారి భార్యలు, పిల్లలు, కోడళ్ల పేర్లు వినిపించడంపై లోలోపల మదనపడుతున్నారు. పార్టీ కోసం చేసిన త్యాగాలకు విలువ లేదా? కష్టపడ్డవాళ్లకు అవకాశాలే లేవా? అన్న ప్రశ్నలు కాంగ్రెస్ శ్రేణుల్లోనే భిన్న స్వరాలుగా మారుతున్నాయి.

**"లీకుల రాజకీయాలు"**

పోటీలో ఉంటామంటూ ప్రచారంఅధికారిక ప్రకటనలకు ముందే,"మేము రేసులో ఉన్నాం" అంటూ లీకులు ఇవ్వడం,తమ పేర్లను ప్రచారంలోకి తేవడం కూడా రాజకీయ వాతావరణాన్ని మరింత గందరగోళంగా మారుస్తోంది.ఇది కేవలం చైర్మన్ పదవి పోటీ మాత్రమే కాదు పార్టీ సిద్ధాంతాలపై ప్రశ్న నాయకత్వ నిర్ణయాలపై ఒత్తిడి ప్రజల విశ్వాసంపై పరీక్షఅనేలా మారింది.తుది నిర్ణయం ఎవరిది?సత్తుపల్లి చైర్మన్ ఎంపికపై తుది నిర్ణయం ఎమ్మెల్యే రాగమయి రాష్ట్ర స్థాయి నాయకుడు దయానందవారి చేతుల్లోనే ఉండటంతో,పార్టీ శ్రేణులు, ఆశావాహులు, కార్యకర్తలు అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.ప్రజల ప్రశ్న "ఎటుపోతుంది సమాజం?"సేవ చేయని, ప్రజల మధ్య లేని, పార్టీతో సంబంధం లేని వారు కూడాడబ్బు, పరిచయాలతో పదవులు దక్కించుకుంటే , ప్రజాస్వామ్యం విలువలు ఏమవుతాయి? రాజకీయాల్లో సేవకు స్థానం ఉంటుందా?అనే ప్రశ్నలు ఇప్పుడు సత్తుపల్లిలో మార్మోగుతున్నాయి.

# మోగిన ఎన్నికల నగారా

**- నేటి నుండి నామినేషన్‌లు**

ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ పట్టణ ప్రజలకు 30 ఏండ్ల నిరీక్షణకు తెరపడింది. సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ ను కలిపి ప్రభుత్వం కార్పోరేషన్‌గా ఏర్పాటు చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉన్నాయంటూ కొందరు కోర్టు మెట్లను ఎక్కారు. దీనితో ఎన్నికలు జరుగుతాయా? లేదా అనే అనుమానాలు రేకెత్తించాయి. మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రంలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలలో ఎన్నికల కోసం అధికారులు మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి 11వ, తేదీన పోలింగ్, 13న, కౌంటింగ్ అనంతరం ఫలితాల వెల్లడిస్తామంటూ తెలిపారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్‌లకు నేటి నుండి నామినేషన్‌లు స్వీకరణ మొదలవుతుంది. వెల్లడించారు. కార్పోరేషన్‌లో అత్యధిక సీట్లను కైవసం చేసుకొని మేయర్ పీఠంపై తమ జెండాను ఎగురవేయాలని సిపిఐ, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పావులు కదుపుతున్నాయి. అయా పార్టీలు ఆర్థిక, సామాజిక, క్యారెక్టర్, సేవా కార్యక్రమాలు కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయటానికి వడపోత కార్యక్రమం చేపట్టినట్లు తెలుస్తోంది. దీనితో ఎవరిని ఎంపిక చేస్తారని ఆశావహులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుండి యువతకు అవకాశం ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కొందరు ఇప్పటికే ఆయా డివిజన్ పరిధిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకొని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

**- నామినేషన్ కేంద్రాలు :**

డివిజన్ నెంబర్ ఒకటి నుండి 9 వరకు, 31 నుండి 48 వరకు పాల్వంచ డివిజన్ కార్యాలయంలో, డివిజన్ నెంబర్ 10 నుండి 19 మరియు 24 నుండి 30 వరకు కొత్తగూడెం మునిపల్ కార్యాలయంలో డివిజన్ నెంబర్ 20 నుండి 23 వరకు సుజాతనగర్ డివిజన్ కార్యాలయాలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్‌లను స్వీకరిస్తారు. ఈ నెల 31వ, తేదీన నామినేషన్‌లను పరిశీలిస్తారు. వెంటనే చెల్లుబాటయ్యే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. వచ్చేనెల రెండున అప్పీళ్ళ పరిష్కారం, ఫిబ్రవరి మూడవ తేదీ, నామినేషన్‌ల ఉపసంహరణ, సాయంత్రం అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు.

**- నామినేషన్ డాక్యుమెంట్స్ :**

అభ్యర్థులు నుండి నేటి ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు రిటర్నింగ్ అధికారి నామినేషన్‌లను స్వీకరిస్తారు. నామినేషన్ ఫారం, ఎస్‌సి, స్‌టి, బిసిలు రూ. 2,500/లు, ఇతరులు రూ. 5000/లు డిపాజిట్ చెల్లించాలి. పోటీ చేయు అభ్యర్థులకు కార్పోరేషన్‌లో ఏదైనా డివిజన్‌లో ఓటు హక్కు కలిగి ఉండాలి. ప్రపోజల్ చేసేవారికి అదే డివిజన్‌లో ఓటుహక్కు కలిగి ఉండాలి. పోటీ చేసే అభ్యర్థులు నూతన ప్రత్యేక బ్యాంకు ఖాతా తీసుకోవాలి. నామినేషన్ సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఎన్నికల ఖర్చు ప్రత్యేక బ్యాంకు ఖాతా నుండి నిర్వహించాలి. వాహనాలు, వ్యక్తుల పై పరిమితులు ఉంటాయి. అభ్యర్థులు తమపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు, మరియు ఆస్తులు, అప్పులు, ఆదాయ వనరులు, విద్యార్హత తదితర వివరాలను అఫిడవిట్‌లో తప్పని సరిగా సమర్పించాలి. ఓటరు గుర్తింపు పత్రం, రిజర్వ్ డివిజన్‌లో పోటీ చేసే వారు ఎస్‌సి, ఎస్‌టి, బిసి ధృవీకరణ పత్రాలు సమర్పించాలి. ప్రతిపాదకుడి సంతకం మరియు స్క్రూటినీకి తప్పని సరిగా హాజరు కావాలని అధికారులు పేర్కొన్నారు.